కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -201 తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ 02-08-2026 ఆదివారం పేజీలు : 4



# ఉత్తరాంధ్రకు రెక్కలు

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బివిఎస్):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరుస్తూ నూతనంగా నిర్మించిన 'భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రాంగణానికి ప్రధాని నరేంద్ర మోడీ చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రధానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ అధికారికంగా రిబ్బన్ కట్ చేసి, విమానాశ్రయ టెర్మినల్‌ను ప్రారంభించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రధానితో కలిసి ప్రాజెక్టు విశేషాలను పరిశీలించారు. అలాగే ప్రాజెక్టు పూర్తి వివరాలు జిఎంఆర్ సంస్థ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో అక్కడే ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రధాని వెళ్లారు. అలాగే సంప్రదాయ గిరిజన ధింసా నృత్యాన్ని ప్రధాని మోడీ తిలకించారు. అనంతరం సభ వేదికపై నుంచి భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

- భోగాపురానికి మోడీ గ్రీన్ సిగ్నల్
- ఉత్తరాంధ్ర కలకు రెక్కలు
- రూ.4,700 కోట్లతో ఎయిర్‌పోర్ట్
- రిబ్బన్ కట్ చేసి జాతికి అంకితం
- చంద్రబాబు--పవన్‌తో మోడీ సందడి
- ఏటా 60 లక్షల ప్రయాణికుల సామర్థ్యం
- ఉత్తరాంధ్రకు కొత్త గ్రోత్ ఇంజిన్
- రూ.18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- 'స్వర్ణాంధ్ర' విజన్‌కు శుభారంభం

# స్పెయిన్‌లోకి వలసదారుల వెల్లువ!

- 24 గంటల్లో 60 వేల మంది ప్రవేశం
- తొక్కిసలాటలో 57 మంది మృతి
- సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి
- మొరాకో నుంచి భారీ వలసలు
- అదనపు బలగాల మోహరింపు
- అక్రమ ప్రవేశాలపై కఠిన చర్యలు




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బివిఎస్):** తమ ఉనికిని చట్టబద్ధం చేసుకుని నివాస హక్కులు పొందవచ్చనే ఆశతో ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకో నుంచి వేలాది మంది వలసదారులు స్పెయిన్‌కు చెందిన సెంయుటా ప్రాంతంలోకి దండయాత్రగా తరలివచ్చారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ఏకంగా...

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్!




- ఈ వారాంతంలోనే దాడుల హెచ్చరిక
- అమెరికా బలగాలకు గ్రీన్ సిగ్నల్?
- యుద్ధ సన్నాహాల్లో వైమానిక దళాలు
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు
- ఇరాన్ వైఖరి మారకపోతే ప్రతీకారం

# వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు ఆదాయం!

- జులైలో రూ.7,865 కోట్ల వసూళ్లు
- ఆల్‌టైమ్ రికార్డు నమోదు
- జీఎస్టీ వృద్ధిలో రెండో స్థానం
- 19 శాతం ఆదాయ వృద్ధి
- పన్ను ఎగవేతపై ఉక్కుపాదం
- 165 బోగస్ కేసుల గుర్తింపు




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బివిఎస్):** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త రికార్డు సృష్టించింది. జులై 2026 నెలలో అత్యధికంగా రూ.7,865 కోట్ల ఆదాయాన్ని సేకరించి, ఇప్పటివరకు ఒక్క నెలలో వచ్చిన గరిష్ట ఆదాయంగా కొత్త చరిత్ర నమోదు చేసింది.

# 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీ!




- తెలంగాణలో 191.. ఏపీలో 186 పోస్టులు
- డిగ్రీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం
- ఆగస్టు 21 వరకు అప్లికేషన్లు
- రూ.24 వేల నుంచి రూ.64 వేల వరకు వేతనం
- అక్టోబర్‌లో ప్రిలిమ్స్.. డిసెంబర్‌లో మెయిన్స్

# పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తుల తేదీలు ఖరారు!




- ఆగస్టు 19 నుంచి అప్లికేషన్లు
- సెప్టెంబర్ 9 వరకు గడువు
- 7,437 పోస్టుల భర్తీ
- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు

# తరచూ ఎన్నికలతో నష్టమెంత?

- పరిశ్రమల నష్టాలపై సర్వే
- సీఐఐతో వివరాల సేకరణ
- జమిలి ఎన్నికలపై కీలక అధ్యయనం
- ప్రాజెక్టుల ఆలస్యంపై ఆరా
- ఉత్పాదకత నష్టంపై లెక్కలు
- ఎన్నికల ప్రభావంపై నివేదిక




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బివిఎస్):** దేశంలో తరచూ జరుగుతున్న ఎన్నికల వల్ల వ్యాపారాలు, పరిశ్రమలపై పడుతున్న ఆర్థిక నష్టంపై ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' పై ఏర్పడిన ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ దృష్టి సారించింది. వివిధ రాష్ట్రాల్లో తరచూ ఎన్నికలు జరగడం వల్ల అది ఆయా ప్రాజెక్టులు, పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు బ్రేకులు పడుతోందనే అభిప్రాయాలు చాలా కాలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తరచుగా జరిగే ఎన్నికల వల్ల వ్యాపార కార్యకలాపాలు, కార్మికుల లభ్యత, పెట్టుబడి నిర్ణయాలు, ప్రభుత్వ అనుమతులపై పడే ప్రభావాన్ని లెక్కించాలని పరిశ్రమలను తాజాగా కోరింది .

సీఐఐ సర్వే.. వివరాల సేకరణ:

ఈ మేరకు 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' వంటి పారిశ్రామిక సంఘాలు దేశవ్యాప్తంగా ఉన్న తమ సభ్య కంపెనీలకు ప్రత్యేక సర్వే ఫారమ్‌లను పంపాయి. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం వల్ల ప్రభుత్వ అనుమతులు, టెండర్ల రద్దు లేదా వాయిదా, భూసేకరణ, పర్యావరణ అనుమతులు, ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల్లో జరిగే ఆలస్యం వల్ల పరిశ్రమలు ఎదుర్కొంటున్న నష్టాలను ఈ సర్వే ద్వారా సేకరిస్తున్నారు.

# అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ అవార్డు

- అమిత్ షా చేతుల మీదుగా సత్కారం
- పూణేలో అవార్డు ప్రదానం
- దేశ భద్రత సేవలకు గుర్తింపు
- తిలక్ వర్ధంతి సందర్భంగా పురస్కారం
- రూ.1 లక్ష నగదు బహుమతి
- దౌత్య సేవలకు ప్రశంసలు

2 లో

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

- రూ.1.09 లక్షల కోట్లు విడుదల
- రాష్ట్రాలకు ముందస్తు నిధుల బదిలీ
- తెలుగు రాష్ట్రాలకు భారీ వాటా
- ఏపీకి 4,597 కోట్లు..
- తెలంగాణకు 2,370 కోట్లు
- సంక్షేమ పథకాలకు నిధుల బలం




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బివిఎస్):** రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు మరియు మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. సహజంగా ప్రతీ నెలా ఇచ్చే గడువు (ఆగష్టు 10) కంటే ముందే ఈ అదనపు వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేయడం విశేషం.

# నాకు నచ్చిన వీడియో షేర్ చేస్తా.. తప్పా: అంబటి రాంబాబు

- తనపై కేసులకు భయపడనన్న మాజీ మంత్రి
- వీడియో అసభ్యం కాదు.. పొలిటికల్ కార్టూన్
- అరెస్ట్ వెనుక కుట్ర ఉందని ఆరోపణలు
- చట్టం అందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్
- తన అభియోగాలపై విచారణ కోరిన అంబటి
- ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తానని స్పష్టం

2 లో

# ఎస్ఆర్ఎస్‌పీని పరిశీలించిన మంత్రులు

- ప్రాజెక్టును సందర్శించిన ఉత్తమ్
- శ్రీధర్‌బాబుతో కలిసి పరిశీలన
- పూడికతీతపై త్వరలో ప్రణాళిక
- నీటి విడుదలపై రెండు రోజుల్లో నిర్ణయం
- బీఆర్ఎస్‌పై ఉత్తమ్ విమర్శలు
- బ్యారేజీల పునరుద్ధరణకు హామీ

2 లో

## ఉత్తరాంధ్రకు రెక్కలు..భోగాపురానికి మోడీ గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

అంతకు ముందు ప్రధాని మోడీకి స్టేజిపై సీఎం చంద్రబాబు నాయుడు సత్కరించారు.

అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. రికార్డు సమయంలో దేశంలోని అత్యాధునిక విమానాశ్రయాన్ని నిర్మించుకున్నామని, ఇది ప్రధాని మోడీ, సీఎం చంద్రబాబు నాయుడు విజన్ వల్లే సాధ్యమైందని ఏపీ అభివృద్ధికి ఉత్తరాంధ్ర నుంచే అడుగులు పడ్డాయని, రామ్మోహన్ నాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. బోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్రలో ఉత్సాహం అధిరిపోయిందని, ఎయిర్ పోర్టును వ్యతిరేకించిన నాయకులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ విజన్ తోనే ఉత్తరాంధ్ర గొప్పతనం ప్రపంచానికి తెలుస్తుందని, ఈ ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర భవిష్యత్ మారిపోతుందని, అభివృద్ధిలో దూసుకుపోతుందని అన్నారు. అలాగే బోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతులకు మంత్రి నారా లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర విభజన తర్వాత కట్టుబట్టలతో ఆంధ్ర రాష్ట్రంలోకి వచ్చిన తమను కేంద్రంలోని ప్రధాని మోడీ తమను ఆదుకున్నారని, రాష్ట్రంలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికి డబుల్ ఇంజన్ ప్రభుత్వ సహకారంతో అభివృద్ధిలో దూసుకుపోతున్నామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమైన భోగాపురం (అల్లూరి సీతారామరాజు) అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ నమూనాలో జీఎంఆర్ గ్రూప్ ద్వారా సుమారు 4,700 కోట్ల కంటే ఎక్కువ వ్యయంతో నిర్మించారు. విజయనగరం జిల్లా భోగాపురంలో మొత్తం 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంతో పాటు ఎవియేషన్ హబ్, ఎవియేషన్ యూనివర్సిటీలు భాగస్వామ్యమై ఉన్నాయి. ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యంతో ప్రారంభమయ్యే ఈ విమానాశ్రయ టెర్మినల్‌ను భవిష్యత్తులో 4 కోట్ల వరకు విస్తరించేలా డిజైన్ చేశారు. 3,800 మీటర్ల పొడవైన విస్తృత రన్‌వే, 25,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రత్యేక కార్గో టెర్మినల్, అధునాతన డిజియాత్ర సాంకేతికతలతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర పరిధిలోని పరిశ్రమలు, విదేశీ ఎగుమతులు మరియు పర్యాటక రంగానికి ప్రధాన వృద్ధి చక్రం గా మారనుంది.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్!

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలుముకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతున్నట్లు తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ వైఖరి మారకపోతే ఈ వారాంతంలోనే ఆ దేశంపై భారీ స్థాయిలో ప్రతీకార దాడులు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్ దాడులను, చర్యలను తీవ్రతరం చేస్తే.. ఇంతకుముందు ఎన్నడూ చూడని రీతిలో అమెరికా బలగాలు ప్రతీకారం తీర్చుకుంటాయని ట్రంప్ హెచ్చరించారు.

యుద్ధసన్నద్ధత..

అమెరికా వైమానిక దళాలు, యుద్ధ నౌకలు ఇప్పటికే రంగంలోకి దిగాయని, దాడులకు సంబంధించిన తుది ఆదేశాల కోసం సర్వసన్నద్ధంగా ఉన్నాయని వార్తలు వెలువడుతున్నాయి. ఇరాన్ కొత్త నాయకత్వం (మొజబా ఖమేనీ), అమెరికా- ఇజ్రాయెల్ కూటమి మధ్య నెలకొన్న వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరుపక్షాలు రాజీ పడకపోవడంతో ప్రాంతీయ శాంతికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. అమెరికా సైనిక వర్గాల నుంచి ఏ క్షణంలోనైనా వైమానిక దాడుల ప్రకటన రావచ్చనే వార్తలతో అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# స్పెయిన్‌లోకి వలసదారుల వెల్లువ!

మొదటి పేజీ తరువాయి

60,000 మంది సరిహద్దులు దాటి తమ భూభాగంలోకి ప్రవేశించినట్లు స్పెయిన్ అధికారులు వెల్లడించారు. సముద్ర మార్గం గుండా ఈదుకుంటూ, సరిహద్దు కంచెలను దాటే క్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాట, ప్రమాదాల కారణంగా కనీసం 57 మంది వలసదారులు ప్రాణాలు కోల్పోయారు. దారితప్పిన గుంపును అదుపుచేసే క్రమంలో భద్రతా బలగాలకు, వలసదారులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకోవడంతో సరిహద్దుల వద్ద రణరంగం నెలకొంది.


ఈ ఊహించని పరిణామంపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరిహద్దును దాటడాన్ని దేశ సార్వభౌమాధికారానికి భంగంగా అభివర్ణించిన ఆయన, అక్కడి పరిస్థితులను వెంటనే అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అదనపు మిలిటరీ, పోలీసు బలగాలను ఘటనా స్థలానికి తరలించామని స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా ముఠాలు వలసదారులకు తప్పుడు ఆశలు చూపి ప్రమాదంలోకి నెట్టాయని, శాంతిభద్రతలను పునరుద్ధరించి చట్టవ్యతిరేకంగా ప్రవేశించిన వారిని తిరిగి పంపించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని ఈ సందర్భంగా స్పెయిన్ ప్రధాని వెల్లడించారు.

# 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీ!

**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించాలనుకునే అభ్యర్థులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) తీపి కబురు అందించింది. దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సుమారు 11,403 బ్యాంక్ క్లర్క్ పోస్టుల భర్తీకి భారీ ఉద్యోగ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ మొత్తం ఖాళీలలో తెలంగాణలో 191 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 186 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా రికగ్నైజ్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

ఈ పోస్టులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవ్వగా, ఈ నెల 21వ తేదీ వరకు అప్లై చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు రూ.175, ఇతర కేటగిరీల అభ్యర్థులకు రూ.850 దరఖాస్తు రుసుముగా నిర్ణయించినట్లు ఐబీపీఎస్ తెలిపింది. ఎంపికైన అభ్యర్థులకు రూ.24,000 నుంచి రూ.64,000 వరకు పే-స్కేల్ లభిస్తుంది. అక్టోబర్‌లో ప్రిలిమినరీ పరీక్షలు, డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని, అర్హులైన అభ్యర్థులు గడువులోగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** రాష్ట్రాల ఆర్థిక స్థితిని మరింత బలపరిచేందుకు మరియు మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటా కింద దేశంలోని అన్ని రాష్ట్రాలకు కలిపి ఒక్కసారిగా రూ. 1,09,019 కోట్లను విడుదల చేసింది. సహజంగా ప్రతీ నెలా ఇచ్చే గడువు (ఆగస్టు 10) కంటే ముందే ఈ అదనపు వాటాను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేయడం విశేషం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాల వద్ద తగినంత నిధుల లభ్యత పెరిగి, అభివృద్ధి ప్రాజెక్టులు మరియు సంక్షేమ పథకాలు మరింత వేగంగా ముందుకు సాగే అవకాశం కలుగుతుంది.

తెలుగు రాష్ట్రాలకు వచ్చిన వాటా..

పన్నుల వాటా కింద ఏపీకి రూ. 4,597 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి రూ. 2,370 కోట్లు కేటాయించారు. కేంద్రం నుంచి అదనపు వాటా ముందుగానే అందడంతో తెలుగు రాష్ట్రాలు తీవ్ర నిధుల సమస్య నుంచి ఉపశమనం పొందే అవకాశముంది. మూలధన వ్యయం పెంచడానికి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడానికి ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని కేంద్రం తెలిపింది.

## వాణిజ్య పన్నుల శాఖకు రికార్డు ఆదాయం!

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్థిక పురోగతి, మెరుగైన పన్ను నిబంధనల అమలు, శాఖ చేపడుతున్న పటిష్టమైన చర్యల వల్ల ఈ ఘనత సాధ్యమైంది.

సరికొత్త ఆల్-టైమ్ రికార్డు..

గతంలో ఏప్రిల్ 2026లో వచ్చిన 77,598 కోట్ల రాబడియే ఇప్పటివరకు అత్యధికం కాగా, ఈ జులైలో సేకరించిన 77,865 కోట్లతో ఆ రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. జులై 2025లో వచ్చిన 76,624 కోట్లతో పోలిస్తే, ఈసారి రూ. 1,241 కోట్లు (19% వృద్ధి) అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తం రాబడిలో జీఎస్టీ ఆదాయమే రూ. 4,452 కోట్లుగా ఉంది. గతేడాది జులై (73,638 కోట్లు)తో పోలిస్తే జీఎస్టీ వృద్ధిలో ఏకంగా 22% పెరుగదల కనిపిస్తోంది. తెలంగాణలోని పన్ను చెల్లింపుదారుల నుండి వసూలైన మొత్తం జీఎస్టీటీ రాబడి (IGST, CGST, SGST కలిపి) 75,819 కోట్లకు చేరింది. జులై నెల జీఎస్టీ వృద్ధిరేటు (19%) విషయంలో దేశంలోనే హర్యానా తర్వాత తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. అఖిల భారత సగటు వృద్ధిరేటు 10%గా మాత్రమే ఉంది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, కొత్త పెట్టుబడులు రావడం, వినియోగం పెరగడమే కాకుండా.. పన్ను ఎగవేతదారులపై సాంకేతికత సాయంతో కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ రాబడి సాధ్యమైందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఎమ్. రఘునందన్ రావు తెలిపారు.

రూ.7300 కోట్ల నకిలీ ఐటీసీ స్కామ్ గుర్తింపు..

జూలై నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో సరఫరా లేకుండానే బోగస్ బిల్లులతో రూ. 300 కోట్ల మేర ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ ) పొందేందుకు యత్నించిన 165 మంది. పన్ను చెల్లింపుదారులను గుర్తించి, వారి రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టారు. సక్రమంగా పన్ను చెల్లించే వారిని గౌరవిస్తూనే, ఉద్దేశపూర్వకంగా పన్ను ఎగవేసే వారిపై జీఎస్‌టీ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు. సకాలంలో పన్నులు చెల్లించిన 4,61,276 మంది తెలంగాణ పన్ను చెల్లింపుదారులకు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

## పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తుల తేదీలు ఖరారు!




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) పోలీసు, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో ఖాళీగా ఉన్న 7,437 పోస్టుల భర్తీకి సంబంధించి కీలక అప్ డేట్ వెలువడింది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ తేదీలను వెల్లడించింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 19వ తేదీ ఉదయం 8:00 గంటల నుండి సెప్టెంబర్ 9వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు అధికారిక వెబ్‌సైట్ www.tgprb.in లో దరఖాస్తులు చేసుకోవచ్చని బోర్డు చైర్మన్ వి. వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. దరఖాస్తులను కేవలం ఆన్ లైన్ లో మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని ఇతర రూపాల్లో వచ్చే దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

ఇటీవలే నోటిఫికేషన్ రిలీజ్:

పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్, ఎమర్జెన్సీ, జైలు విభాగాల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి సంబంధించిన మొత్తం నాలుగు నోటిఫికేషన్లను టీఎస్ఎల్పీఆర్బీ గత నెల 29వ తేదీన విడుదల చేసింది. అయితే దరఖాస్తుల ప్రారంభానికి సంబంధించిన ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో తాజాగా దరఖాస్తుల తేదీలను ప్రకటించింది.

వన్ టైమ్ ఫీజు:

పరీక్ష రుసుముకు సంబంధించి, మొత్తం నియామక ప్రక్రియ ముగిసే వరకు (దరఖాస్తు రుసుము, ప్రాథమిక రాత పరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్/ఎఫిషియెన్సీ టెస్టులు, తుది రాత పరీక్ష మరియు బయోమెట్రిక్స్ వంటి అన్ని దశలకు) అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే ఈ 'వన్-టైమ్ ఫీజు' చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సై, సబ్ ఇన్ స్పెక్టర్ స్థాయి పోస్టులు (సివిల్, ఏఆర్, టీజీఎస్పీ, సార్సిపిఎల్, ఎస్పీఎఫ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, డిప్యూటీ జైలర్, ఏఎస్సై ఎఫ్‌పీబీ)లకు తెలంగాణకు చెందిన స్థానిక ఎస్సి మరియు ఎస్టీ అభ్యర్థులకు పరీక్ష రుసుము రూ. 750 , ఇతర అభ్యర్థులందరికీ (ఓసీ, బీసీ మరియు ఇతరులు) రూ.1,500గా నిర్ణయించారు. అలాగే కానిస్టేబుల్, ఫైర్‌మేన్, వార్డర్, ఇతర డ్రైవర్, మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే స్థానిక ఎస్సి/ఎస్టీ అభ్యర్థులకు రుసుము రూ.600 కాగా, ఇతర అభ్యర్థులందరికీ రూ.1,200గా నిర్ణయించారు.


## అజిత్ దోవల్‌కు లోక్‌మాన్య తిలక్ అవార్డు




**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను లోక్‌మాన్య తిలక్ జాతీయ అవార్డు వరించింది. ఈ అవార్డును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా పూణేలో అందజేశారు. బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా అవార్డు ప్రదానం చేశారు. దేశ భద్రత, కౌంటర్ టెర్రరిజం, సరిహద్దు భద్రతలో సేవలకు ఈ అవార్డును అందజేస్తారు. అవార్డులో మెమెంటో, ప్రశంసాపత్రం, రూ.1 లక్ష నగదు బహుమతి ఉంటుంది. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, సునేత్ర పవార్ పాల్గొన్నారు.

ఇదిలా ఉంటే దేశ భద్రత, దౌత్యం, ఇంటెలిజెన్స్ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న అజిత్ దోవల్ భారత రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించారు. ఆపరేషన్ బ్లాక్ థండర్, డోక్లామ్ వివాదంలో ఆయన వ్యూహాత్మక దౌత్య చర్చలు, బాలాకోట్ వైమానిక దాడుల వెనక ఆయన వ్యూహంపై ప్రశంసలు కురిశాయి. ఈయన 1968 కేరళ కేడర్ కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి కాగా మూడు దశాబ్దాలకు పైగా భారత ఇంటెలిజెన్స్ లో పనిచేశారు. తరవాత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ గా వ్యవహరించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలతో పాటు, లండన్, ఇస్లామాబాద్ లలో భారత దౌత్య కార్యాలయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు.


## ఎస్ఆర్ఎస్పీని పరిశీలించిన మంత్రులు



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులు నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్ఆర్ఎస్పీ) ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. అధికారులతో కలిసి ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రులు జలాశయంలో ప్రస్తుత నీటి మట్టం వివరాలను, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహ పరిస్థితిని ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని, ప్రాజెక్టులోని పూడికతీతపై త్వరలోనే స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. అలాగే ఆయకట్టుకు నీటి విడుదలపై రాబోయే రెండు రోజుల్లో స్పష్టత ఇస్తామని వెల్లడించారు.

ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దెబ్బతిన్న ఆ మూడు బ్యారేజీలను పునరుద్ధరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, దానిపై కూడా బీఆర్ఎస్ అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యామ్‌లు 60 ఏళ్లైనా చెక్కుచెదరకుండా బలంగా నిలిచాయని, కానీ బీఆర్ఎస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది కాలానికే దెబ్బతిన్నాయని మంత్రి ఉత్తమ్ విమర్శించారు.

# నాకు నచ్చిన వీడియో షేర్ చేస్తా.. తప్పా: అంబటి రాంబాబు



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** తనకు నచ్చిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తానని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కేంద్రమంత్రి చంద్రశేఖర్‌పై తన ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన వీడియో అసభ్యకరం కాదని, పొలిటికల్ కార్టూన్ అని ఆయన తెలిపారు. తనపై కేసు నమోదు అయినట్లు తనకు తెలియదన్నారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. తన ఇంటిపై దాడి జరిగితే తననే అరెస్ట్ చేయడంలో కేంద్రమంత్రి చంద్రశేఖర్ కుట్ర ఉందని అంబటి ఆరోపించారు. కేంద్రమంత్రి చంద్రశేఖర్ నేరస్తుడు. నా అరెస్ట్ వెనుక ఆయన కుట్ర ఉంది. ఆయనే నా ఇంటిపై దాడి చేయించారు. నన్ను పోలీస్ స్టేషన్ లోకి తీసుకెళ్లిన తర్వాత పోలీసులకు ఫోనులు చేసి నన్ను హింసించమని వారికి చెప్పారు. చంద్రశేఖర్ అండతోనే హింసించే ప్రయత్నం చేశారు. కేంద్రమంత్రి అయినా, ఎవరైనా సరే చట్టవ్యతిరేకంగా పని చేశారు. దానిపై విచారణ జరపాలని నేను కోరా. విచారణ జరపలేదు. అందుకే నేను ఉద్యమం చేస్తున్నా. అందులో భాగంగానే పెమ్మసాని చంద్రశేఖర్ ను చట్టప్రకారం శిక్షించవల్సిందే. నా అభియోగాలపై విచారణ జరపాలి." అని అంబటి రాంబాబు డిమాండ్ చేశారు.

మాపైనా ట్రోల్స్ ... కేసులెందుకు పెట్టడంలేదు

"నాపైనా, జగన్ మోహన్ రెడ్డిపైనా వీడియోలు, పోస్టులు పెడుతున్నారు. మరి కేసులు ఎందుకు పెట్టడంలేదు. మా అందరినీ ట్రోల్స్ చేస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ఏఐ వీడియోలు రిలీజ్ చేస్తున్నారు. మరి కేసులు పెట్టారా..?. చట్టం ఆరకంగా నడుస్తోంది. ఆ వీడియోలను నేను క్రియేట్ చేశా. నాకు ఎవరూ పంపించలేదు. ఆ వీడియో, కార్టూన్ పట్ల నాకు బాధ్యత ఉంది. కేసులు పెడితే మైలేజ్ రాదు. కేసులకు భయపడను. మర్డర్లు, స్కాములు, దోపిడీలు చేశా. ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నా. ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదు." అని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# తరచూ ఎన్నికలతో నష్టమెంత?.. దేశవ్యాప్తంగా సర్వే ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్ట్ వ్యయం పెరగడం, కొత్త పెట్టుబడుల నిర్ణయాలు వాయిదా పడటం వంటి అంశాలపై కూడా స్పష్టమైన నివేదికలను కోరుతున్నారు. ఈ మేరకు గతంలో జరిగిన లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వ్యాపార కార్యకలాపాలకు ఎంతమేర విఘాతం కలిగింది? ఎంత మొత్తం నష్టం వాటిల్లింది? అనే వివరాలను అంచనా వేసి పంపాలని జేపీసీ కోరింది. దేశవ్యాప్తంగా జమిలి (ఒకేసారి) ఎన్నికలు నిర్వహిస్తే ప్రాజెక్టుల నిర్వహణలో ఎంత శాతం పురోగతి ఉంటుంది? వ్యాపార సమర్థత ఎంత పెరుగుతుంది? దాని ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాల వివరాలను కూడా సమర్పించాలని జేపీసీ కంపెనీలను కోరింది.

ఉద్యోగుల సెలవులు, ఇతర రంగాల నష్టం!

ఇక ఎన్నికల సమయంలో ఓటింగ్ నిమిత్తం ఉద్యోగుల విధులకు హాజరుకాకపోవడం, ప్రయాణ పరిమితులు, భద్రతా ఆంక్షల వల్ల కోల్పోయిన పనిదినాలు, ఉత్పాదకత నష్టాన్ని కంపెనీలు సేకరిస్తున్నాయి. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు సమయంలో మద్యం విక్రయాల నిషేధించడం వల్ల హోటళ్లు, పర్యాటక రంగానికి వస్తున్న రాబడి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఇక ఉపాధ్యాయులను ఎన్నికల విధుల్లోకి తీసుకోవడం, పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రాలుగా ఉపయోగించడం వల్ల విద్యాబోధనకు కలిగే ఆటంకాలను కూడా సర్వేలో సేకరిస్తున్నారు.

# 'చందా చోరీ' స్కిట్ వివాదం రాహుల్ సహా పలువురిపై ఎఫ్ఐఆర్



**న్యూస్ డెస్క్, 01 ఆగస్టు (బిఎన్ఎస్):** ఆయోధ్య 'చందా చోరీ' స్కిట్ వివాదానికి దారి తీసింది. అయోధ్య విరాళాల చోరీపై పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యులు ప్రత్యేక స్కిట్ వేశారు. పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి.. అయోధ్యలోని శ్రీరాముని ఫొటోను చేతిలో పట్టుకుని.. భక్తుల నుంచి కానుకలు స్వీకరిస్తున్న ఆలయ పూజారిగా నటిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ఇప్పుడు వివాదంగా మారింది. కొందరు సాధువులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాహుల్ గాంధీ సహా పలువురిపై కేసు నమోదైంది.

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ పార్లమెంట్ వెలుపల ఇండియా కూటమి నేతలు నిర్వహించిన నిరసనపై సాధు సమాజం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించిన తీరు సనాతన ధర్మాన్ని అవమానించేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సాధు సమాజం సభ్యులు హెచ్చరించారు.

కాశీ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌరవ్ బన్స్వాల్ మాట్లాడుతూ.. ఈ ఘటనపై కోత్వాలి పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు అందిందని తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని వీడియోలకు సంబంధించి ఫిర్యాదు నమోదైనట్లు చెప్పారు. ఆ వీడియోల్లో పప్పు యాదవ్ సాధువు వేషధారణలో కనిపిస్తూ.. సనాతన ధర్మాన్ని అవమానించేలా కొన్ని చర్యలకు పాల్పడ్డారని ఫిర్యాదుదారులు ఆరోపించినట్లు వెల్లడించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తున్నామని, తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీ గౌరవ్ బన్స్వాల్ తెలిపారు. ఘటనకు సంబంధించిన వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన తర్వాత దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగుతున్న సమయంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. అయోధ్య రామమందిర విరాళాల సేకరణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్‌లోని మకర ద్వారం సమీపంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ఇటీవల ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యలపై కూడా అమిత్ షా స్పందించాలని ప్రతిపక్ష సభ్యులు కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో "చందా చోర్, గద్దీ ఛోడ్", "జవాబ్ తుమ్‌కో దేనా హోగా", "అమిత్ షా, సదన్ మే ఆవో" అంటూ నినాదాలు చేశారు.

పూర్ణియా ఎంపీ పప్పు యాదవ్ కాషాయ వస్త్రాలు ధరించి ఈ నిరసనలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పాత్రను పోషిస్తూ.. భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అయోధ్య రామమందిరానికి సంబంధించిన శ్రీరాముడి చిత్రాన్ని కూడా ఆయన చేతిలో పట్టుకున్నారు. పప్పు యాదవ్ ప్రదర్శించిన ఈ స్కిట్ సనాతన ధర్మాన్ని అవమానించేలా ఉందని సాధు సమాజం ఆరోపించడంతో వివాదం చెలరేగింది.

ఈ ఘటనపై రాహుల్ గాంధీ, పప్పు యాదవ్, అవధేశ్ ప్రసాద్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సంబంధిత నేతలు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను

# ఘనంగా నిర్వహించాలి

### జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు



నెల్లూరు జిల్లా కలెక్టరేట్(బిఎన్ఎస్):– జిల్లాలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాన వేడుకలతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో స్వాతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల వేదికను ఆకర్షణీయంగా అలంకరించడంతో పాటు అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని చాటేలా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని, ఇందుకు సంగీత కళాశాల, విద్యాశాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాల ప్రదర్శన, శాఖల స్టాల్స్ వినూత్నంగా ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వివరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి గౌరవ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రతి శాఖ నుంచి ఐదుగురు అధికారుల పేర్లను ఈ నెల 7వ తేదీలోగా డీఆర్‌ఓకు పంపించాలని, అలాగే శాఖల ప్రగతి నివేదికలను చీఫ్ ప్లానింగ్ అధికారికి వెంటనే సమర్పించాలని ఆదేశించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం సమష్టిగా కృషి చేసి, ప్రజలకు చిరస్మరణీయమైన వేడుకలను అందించాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ విజయ్ కుమార్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాపూరు వాసికి అరుదైన గౌరవం

### ఒమన్ ఏపీ ఎన్నార్టీ టీడీపీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ వినోద్ కుమార్ పచ్చిగళ్ల నియామకం


AP Non Resident Telugu Society

Certificate OF NOMINATION

This is to certify that the Andhra Pradesh Non-Resident Telugu Society (APNRT), a wholly owned entity of the Government of Andhra Pradesh, India, hereby appoints

SRI DR VINOD KUMAR PATCHIGALLA

Membership ID.: NRT6162371840

as the COUNTRY COORDINATOR – Oman.

In this voluntary role, he is authorized to coordinate with APNRT, the Embassy, and local authorities to support the welfare of Non-Resident Telugus (NRTs) from Andhra Pradesh and assist in addressing their grievances in accordance with APNRT guidelines and the laws of Oman.

Dr. Ravikumar Vemuru
Advisor to the GOAP, NRI Affairs, President, APNRT Society

Sri Kondapalli Srinivas
Hon'ble Minister of MSME, SERP and NRI Affairs & Empowerment



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– నెల్లూరు జిల్లా రాపూరు మండల మాజీ సర్పంచ్ మరియు వైస్ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పచ్చిగళ్ళ రత్నయ్య తనయుడు డాక్టర్ వినోద్ కుమార్ పచ్చిగళ్లకు అరుదైన గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని నాన్–రెసిడెంట్ తెలుగు సొసైటీ ఒమన్ దేశానికి సంబంధించి ఆయనను టీడీపీ పార్టీ కోఆర్డినేటర్‌గా నియమించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల సాధికార శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఏపీ ఎన్నార్టీ సొసైటీ తరఫున ఆయనకు అధికారిక నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ స్వచ్ఛంద బాధ్యత ద్వారా ఒమన్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ నివాసేతర తెలుగువారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు డాక్టర్ వినోద్ కుమార్ కృషి చేయనున్నారు. ఏపీ ఎన్నార్టీ మార్గదర్శకాలు మరియు ఒమన్ దేశ చట్టాలకు లోబడి, గల్ఫ్ ప్రాంతంలో ఉన్న తెలుగువారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించడంలో ఆయన క్రియాశీలక పాత్ర పోషిస్తారని స్పష్టం చేశారు. ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులు మరియు ఏపీ ఎన్నార్టీ యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ గల్ఫ్ తెలుగువారికి అండగా నిలవడానికి వినోద్ కుమార్‌కు అధికారాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పచ్చిగళ్ళ రత్నయ్య మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందనడానికి నా కుమారుడి నియామకమే నిదర్శనం. విదేశాల్లో ఉన్న తెలుగువారికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మరియు స్థానిక వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# చేనేత కార్మికులు ముద్ర రుణాలు సద్వినియోగం చేసుకోవాలి




నల్లగొండ (బిఎన్ఎస్): జిల్లాలోని చేనేత కళాకారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిని విస్తరించడంతో పాటు, ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్ లో జిల్లా చేనేత కళాకారులకు ముద్ర రుణాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే రంగాలలో చేనేత ప్రథమ వరుసలో ఉన్న చేనేత కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడు ముద్ర రుణాలను వినియోగించుకుని తమ వృత్తిని విస్తరించి, ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు.

ముద్ర పథకం కింద బ్యాంకుల ద్వారా 50 వేల నుంచి 10 లక్షల వరకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, వ్యక్తిగతంగా, సంఘాలుగా లేదా క్లస్టర్‌ల రూపంలో కూడా ఈ రుణాలను పొందే అవకాశం ఉందన్నారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాలతో పాటు చేనేత భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను తప్పకుండా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# శానాయిపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):– రాపూరు మండలంలోని శానాయిపాలెం పంచాయతీలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మరియు క్లస్టర్–4 ఇన్‌చార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు, రాపూరు ఎంపీడీవో వసుంధరమ్మ తో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.?ఈ సందర్భంగా తిక్కమనేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. వయోవృద్ధులు, అవ్వతాతల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకే ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరేలా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం లబ్ధిదారులకు నేరుగా ఫలాలు అందిస్తోందని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గుండపనేని శివాజీ నాయుడు,సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కంబాలపల్లిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

### స్పందించిన టిడిపి నేత తిక్కమనేని ప్రసాద్ నాయుడు




నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్) :–నెల్లూరు జిల్లాలోని రాపూరు మండల పరిధిలోని కంబాలపల్లి పంచాయతీలో ఎదురవుతున్న పలు తీవ్ర సమస్యలకు నివారణ లభించింది. గ్రామంలో సైడ్ కాలవలు పూడికపడి అధ్వానంగా మారడం, వీధి దీపాలు వెలగకపోవడం మరియు రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలు (జంగిల్) అల్లుకుపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.?ఈ సమస్యల తీవ్రతను గుర్తించిన స్థానిక గ్రామస్థులు వెంటనే టిడిపి తిరుపతి పార్లమెంట్ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి మరియు క్లస్టర్–4 ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై వెంటనే స్పందించిన ప్రసాద్ నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుని, యుద్ధ ప్రాతిపదికన సంబంధిత అధికారులతో మాట్లాడి ?గ్రామ ప్రజల ఇబ్బందులను అధికారులకు వివరించి, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. దాంతో అధికారులు స్పందించి గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సైడ్ కాలవల్లో పూడికతీత, పనిచేయని వీధి లైట్ల పునరుద్ధరణ, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ళ పొదలను (జంగిల్ క్లియరెన్స్) పూర్తిగా తొలగించారు. తమ సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన క్లస్టర్–4 ఇంచార్జ్ తిక్కమనేని ప్రసాద్ నాయుడుకి మరియు సంబంధిత అధికారులకు కంబాలపల్లి గ్రామ ప్రజలు, టిడిపి నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## కోనలో వైభవంగా స్వామివారి కళ్యాణోత్సవం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):–నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో శనివారం పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ చెంచులక్ష్మీ, శ్రీ ఆదిలక్ష్మీ సమేత శ్రీ నరసింహస్వామివారికి భక్తులు సమర్పించిన 100 గొడుగులతో తిరుచ్చి సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలు, గిరిజనుల సాంప్రదాయ వాయిద్యాల మోతల నడుమ ఈ సేవ శోభాకరంగా సాగింది. తర్వాత నిర్వహించిన సహస్ర దీపాలంకరణ సేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. మిరిమిట్లు గొలిపే దీపాల కాంతుల్లో స్వామివార్ల రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.?ఈ విశేష పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు.

# లంకవాసుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలి :: చిర్ల జగ్గిరెడ్డి



గంటిపెదపూడి(బిఎన్ఎస్)ఆగష్టు1: కోనసీమ జిల్లా గంటి పెదపూడి––ఉడుముడి లంక ప్రాంతంలో వరద ప్రభావిత ప్రాంతాలను మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి, సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరిలో వరద ఉధృతి పెరిగి గంటిపెదపూడి, ఉడుముడిలంకతో పాటు సుమారు 17 లంక గ్రామాలు నీటితో చుట్టుముట్టబడ్డాయని తెలిపారు. ప్రతి సంవత్సరం వరదలు రావడం, లంక గ్రామాలు నీట మునగడం ఈ ప్రాంత ప్రజలకు కొత్త విషయం కాదని, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఒక శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాలను కోరుతున్నారని అన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ బ్రిడ్జికి నిధులు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టారని, అనంతరం వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.

తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉడుముడిలంక ప్రాంతాన్ని సందర్శించి బ్రిడ్జి నిర్మాణాన్ని మళ్లీ వేగవంతం చేశారని, ఆయన చొరవతో ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. ప్రస్తుతం కేవలం 20 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే నిధులు విడుదల చేసి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం కోసం స్థానిక రైతులు పూర్తి పరిహారం అందకముందే ప్రజాహితం కోసం స్వచ్ఛందంగా తమ భూములను ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా వారికి తగిన భూ పరిహారం చెల్లించి, బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తే విద్యార్థులు, రైతులు, ప్రజలు ప్రతి సంవత్సరం వరదల సమయంలో ఎదుర్కొనే ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని అన్నారు.

ఇప్పటికే వరద నీరు గ్రామాల్లోకి ప్రవేశించి 24 గంటలు దాటిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధితులకు వెంటనే వరద సహాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆలస్యం చేయకుండా బాధిత కుటుంబాలకు అన్ని రకాల సహాయాన్ని వెంటనే అందించాలని కోరారు.

ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం బోట్లను ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే లంక గ్రామాల్లో అధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నందున వారికి అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు, నిత్యావసర సరుకులు, పంట నష్టానికి సంబంధించిన ఉపశమన చర్యలు కూడా వెంటనే చేపట్టాలని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను ఇప్పుడు ప్రారంభించామని చెప్పుకోవడం కంటే, ప్రజలకు ఉపయోగపడేలా మిగిలిన 20 శాతం బ్రిడ్జి పనులను పూర్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. గంటిపెదపూడి, ఉడుముడిలంక ప్రజల ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చేలా వెంటనే నిధులు విడుదల చేసి బ్రిడ్జిని పూర్తిచేస్తే ప్రతి ఏడాది వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొనే కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

# మిర్చి రైతులను ఆదుకోండి..!



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 01: జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల రైతులతో కలసి మైలవరం జలాశయం ను వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సందర్శించారు . జలాశయం పరిశీలన అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కడపజిల్లా ప్రజలకు త్రాగునీటి కొరకు నిన్నటి రోజున మైలవరం జలాశయం నుండి పెన్నా నదికి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. మైలవరం జలాశయం ఉత్తర మరియు దక్షిణ కాల్వ చుట్టూ ఉన్న జమ్మలమడుగు నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు రైతన్నకు నీరు ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వం పైన చాలా ఉందన్నారు. దక్షిణ కాల్వ గేట్ మరమ్మత్తుల వలన గత 3 సంవత్సరాలనుండి దాదాపుగా 100 క్యూసెక్కుల పైన నీరు వృధా అవుతూ.. గూడెంచెరువు, అనంతగిరి గ్రామ పొలాలలోనికి అవసరానికి మించి నీరు చేరడంతో జమ్మూ, గడ్డి పెరుగుతూ రైతులు పండించిన పంటలకి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని అన్నారు.

# నాణ్యత, పారదర్శకత, ప్రజాసేవలో రాజీపడొద్దని అధికారులకు ఆదేశాలు



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 01: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా 804 కోట్లతో కడప నగర రూపురేఖలు మారనున్నాయని, ప్రతి రూపాయి ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కడప నగరపాలక సంస్థ బోర్డు మీటింగ్ హాలులో ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన కేఎంసీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను సమీక్షించి ఆమోదం తెలుపడంతో పాటు, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కడప నగరాన్ని ఆధునిక మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే దిశగా నగరపాలక సంస్థ కీలక అడుగు వేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం రూ.804.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కడప నగరపాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదం లభించడం జరిగిందన్నారు. నగరంలో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, సీసీ రహదారులు, డ్రైనేజీ, చెరువుల పునరుద్ధరణ, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, పన్నుల వసూళ్లు, పచ్చదనం, ప్రజా భద్రత వంటి ప్రతి అంశంలో నాణ్యతతో కూడిన అభివృద్ధి పనులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రూ.804.62 కోట్లతో నగర సమగ్ర అభివృద్ధి కోసం ప్రతిపాదించి ఆమోదం పొందిన అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద తాగునీటి సరఫరా వ్యవస్థ బలోపేతానికి రూ.592.23 కోట్లు, సీవరేజ్, సెప్టేజ్ నిర్వహణ వ్యవస్థ అభివృద్ధికి రూ.70.82 కోట్లు, పుట్లంపల్లి, దేవుని కడప చెరువుల పునరుద్ధరణకు రూ.83.45 కోట్లు, 15 వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ పనులకు రూ.25.87 కోట్లు, నగరపాలక సంస్థ సాధారణ నిధులతో సీసీ రహదారులు, డ్రైనేజీ పనులకు రూ.32.25 కోట్లు, మొత్తంగా రూ.804.62 కోట్లతో నగర మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ చెరుకూరి తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ డా.పి. భవాని ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్.ఈ. చెన్నకేశవ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ కార్పోరేషన్ ఇంజినీర్లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సినిమా న్యూస్


## ఓటీటీలోకి 'లెనిన్'




అక్కినేని అఖిల్ కెరీర్‌లోనే మొట్టమొదటి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన భారీ ప్రాజెక్ట్ 'లెనిన్'. భారీ అంచనాల నడుమ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్ల వర్షం కురిపిస్తూ నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది. ఈ రూరల్ యాక్షన్ డ్రామాలో అఖిల్ సరసన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్ల కలెక్షన్లను రాబట్టి అఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. అఖిల్ సరికొత్త మాస్ లుక్, మాస్ ఎలిమెంట్స్, పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

థియేటర్లలో సంచలన విజయం సాధించి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ మాస్ యాక్షన్ డ్రామా, ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 దక్కించుకుంది. ఈ క్రమంలోనే 'లెనిన్' చిత్రాన్ని రాబోయే ఆగస్టు 7వ తేదీ నుంచి తమ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నట్లు ఒక స్పెషల్ ప్రోమో వీడియో ద్వారా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ పోస్ట్‌కు గర్జన మొదలవుతోంది.ప్రేమ, ప్రతీకారం, విప్లవాల కథ మీ తెరలను అలరించడానికి సిద్ధంగా ఉంది. లెనిన్ ఆగస్టు 7న, ప్రత్యేకంగా తెలుగు జీ5లో ప్రసారం కానుంది" అని రాసుకొచ్చారు. థియేటర్లలో మిస్ అయినవారు, మళ్లీ చూడాలనుకునేవారు జీ5లో ఈ బ్లాక్‌బస్టర్ హిట్ సినిమాను చూడొచ్చు.


## కామెడీతో హారర్ ట్రీట్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'కొరియన్ కనకరాజు'. ఈ చిత్రంలో గ్లామరస్ బ్యూటీ రితికా నాయక్ హీరోయిన్ నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, ఆగస్ట్ 7వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్ల జోరు పెంచిన చిత్ర యూనిట్, తాజాగా 'కొరియన్ కనకరాజు' ట్రైలర్‌ను విడుదల చేసింది. కమెడియన్ సత్య కామెడీ సీన్‌తో ఎంతో ఆసక్తికరంగా ప్రారంభమయ్యే ఈ ట్రైలర్, ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతూ సాగింది. కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక సరికొత్త హారర్ యాక్షన్ కామెడీ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ ఎంతో వినోదాత్మకంగా తెరకెక్కించారు.

ఈ సినిమాలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని విధంగా రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తుండటం విశేషం. వరుణ్ తేజ్ లుక్స్, డిఫరెంట్ మేకోవర్, ఆయన టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సత్య, వరుణ్ తేజ్ మధ్య వచ్చే కామెడీ సన్నివేశాలు థియేటర్లలో నవ్వుల పువ్వులు పూయించడం ఖాయంగా కనిపిస్తోంది. హారర్ ఎలిమెంట్స్‌కు యాక్షన్, ఫన్ జోడించి తీసిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, తమన్ సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న ఈ ట్రైలర్, ఆగస్ట్ 7న రాబోతున్న సినిమాపై ప్రేక్షకుల్లోనూ, మెగా అభిమానుల్లోనూ అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.

## 'టాక్సిక్' కౌంట్‌డౌన్ స్టార్ట్




కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ డ్రామాపై ప్రేక్షకుల్లోనూ, సినీ వర్గాల్లోనూ మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. వివిధ కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం, చివరకు ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్స్‌ను మేకర్స్ వరుసగా విడుదల చేస్తూ మూవీపై హైప్ పెంచుతున్నారు. తాజాగా హీరో యష్ తన సోషల్ మీడియా ద్వారా ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. కౌంట్‌డౌన్ మొదలైందంటూ 'టాక్సిక్' థియేట్రికల్ ట్రైలర్‌ను ఆగస్టు 8న విడుదల చేయబోతున్నట్లు తెలుపుతూ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు.

ఈ ఒక్క ప్రకటనతో యష్ అభిమానులతో పాటు పాన్ ఇండియా ప్రేక్షకుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. టీజర్లతోనే విపరీతమైన ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమాలో అసలు కథ ఏంటి? యష్ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఏ స్థాయిలో ఉండబోతోందో ట్రైలర్‌లో చూపించబోతున్నారని సమాచారం. ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో యష్ సరసన నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నవీన్ యెర్నేని సహకారంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ కోసం సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## హీరోయిన్‌గా బాలయ్య చిన్న కూతురు



నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని నందమూరి వెండితెరపైకి అడుగుపెట్టబోతున్నారనే వార్త ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో సంచలనంగా మారింది. సినీ పరిశ్రమలో ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన నందమూరి కుటుంబం నుండి ఇప్పటివరకు పలువురు హీరోలు వచ్చి తమ సత్తా చాటారు. అయితే ఆ ఫ్యామిలీ నుండి ఒక నటి వెండితెరపై మెరిసే అవకాశం ఇప్పటివరకు రాలేదు. ఇప్పుడు తేజస్విని ఎంట్రీ నిజమైతే నందమూరి ఫ్యామిలీ నుండి వెండితెరపై అడుగుపెడుతున్న తొలి నటిగా కొత్త చరిత్ర సృష్టించనున్నారు.

విశ్వసనీయ సమాచారం ప్రకారం తేజస్విని ఒక పవర్‌ఫుల్ ఫీమేల్ సెంట్రిక్ ప్రాజెక్ట్ ద్వారా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. ఒక మంచి సామాజిక సందేశంతో పాటు క్రీడా నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామా కథతో ఆమె ప్రేక్షకులను అలరించనున్నారని తెలుస్తోంది. పాత్రకు ఉన్న ప్రాధాన్యం కథలోని బలమైన కంటెంట్ నచ్చడంతోనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే నిర్మాతగా బాలకృష్ణ నిర్మాణ బాధ్యతలు మరియు ప్రమోషన్లలో కీలక పాత్ర పోషిస్తూ తన ప్రతిభను నిరూపించుకున్న తేజస్విని.. ఇప్పుడు నేరుగా నటిగా మారబోతుండటంతో నందమూరి అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ బిగ్ అప్‌డేట్‌పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో అని సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సెకండ్ సింగిల్ డేట్ ఫిక్స్


మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్ జంటగా నటిస్తున్న ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఇరుముడి'. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటుడు సాయి కుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు.



మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా అయ్యప్ప దీక్ష నేపథ్యంలో సాగే ఒక భావోద్వేగభరితమైన తండ్రీ కూతుళ్ల కథ అని తెలుస్తోంది. గతం ఉన్న ఒక తండ్రి, తన చిన్నారి కూతురి కోరిక మేరకు అయ్యప్ప దీక్ష తీసుకునే క్రమంలో ఎదురయ్యే సంఘటనల చుట్టూ కథ తిరుగుతుందని సమాచారం. రవితేజ అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ మూవీ మ్యూజికల్ ప్రమోషన్స్ ఇప్పటికే ఘనంగా ప్రారంభమయ్యాయి. గతంలో విడుదల చేసిన మొదటి పాటకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఇక సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో, మేకర్స్ తాజాగా రెండో పాటకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను విడుదల చేశారు. 'ఎలాలోయాలలో మనసుతన్నల' అని సాగే ఈ రెండో పాటను ఆగస్టు 3వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటిస్తూ ఒక కలర్‌ఫుల్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఈ పోస్టర్‌లో రవితేజ అరటి పండ్ల లోడ్‌తో ఉన్న బండిపై తన కూతురు, భార్యతో కలిసి ప్రయాణిస్తూ కనిపించారు. ఈ పోస్టర్ ముగ్గురి మధ్య ఉన్న ప్రేమానురాగాలను, కుటుంబ బాండింగ్‌ను ఎంతో అందంగా చూపిస్తోంది.

## స్పైడర్ మ్యాన్ హవా




హాలీవుడ్ స్టార్ హీరో టామ్ హాలండ్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ సూపర్ హీరో మూవీ 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ నివ్ డే' బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టిస్తోంది. డెస్టిన్ డేనియల్ క్రీటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జెండాయా, జాకబ్ బటాలాన్, సాడీ సింక్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ప్రపంచవ్యాప్త విడుదలకు ముందే భారత్‌లో గురువారమే విడుదలైన ఈ సినిమా, కేవలం రెండు రోజుల్లోనే రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించి అదరగొట్టింది.

చిత్ర నిర్మాత ప్రకటించిన నివేదిక ప్రకారం.. ఈ సినిమా మొదటి రోజు రూ. 72.44 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టగా, రెండో రోజు రూ. 59.02 కోట్లు వసూలు చేసింది. దీంతో మొత్తంగా భారత్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం రూ. 131.46 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని దాటింది. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2డి, 3డి ఫార్మాట్లలో విడుదలైన ఈ చిత్రానికి అన్ని ప్రాంతాల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.